# అనైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా

## ప్రసన్నకుమార్ సర్రాజు

ముఖ్యమంత్రి కాన్‌వాయ్ పెద్దిభొట్లవారి సందులోకి తిరుగుతోంది. ఆయన కూర్చుని వున్న ఎంబాసడర్ ముందు రెండు మోటారుసైకిళ్ళ మీద పైలట్స్ వెడుతున్నారు. వాళ్ళిద్దరి నోళ్ళల్లో బూరాలు వున్నాయి. అదేపనిగా వాళ్ళు వూదుతున్న శబ్దానికి మనుష్యులు కొంచెం వంగుతున్నట్లు నటించి ప్రక్కకి తొలగుతున్నారు. అంబాసిడర్ వెనకాల నాలుగు ఆటోల్లో సీయమ్ పర్సనల్ సెక్యూరిటీ, ఆ వెనకాల ఎనిమిది సైకిళ్ళ మీద అటెండర్లూ ఫాలోఅవుతున్నారు.

పెద్దిభొట్లవారి సందులో వున్న గవర్నర్ బంగళా(?) దగ్గర కారు ఆగింది. బక్కపల్చగా వున్న సెక్యూరిటీ గార్డు గేటుతెరిచి సెల్యూట్ కొట్టాడు. కాన్వాయ్ లోపలికెళ్ళి పెద్దగా పార్కింగ్ సౌకర్యంలేని పోర్టికోలో అక్కడక్కడా సర్దుకుని ఆగింది.

లోపల్నుంచీ గవర్నర్ పీయే వచ్చి, వినయంగా ఆహ్వానిస్తూ సీయమ్‌ని గవర్నర్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

సీయమ్‌ని వాత్సల్యంగా కౌగలించుకుని, ''వాట్‌వుడ్‌యు లైకటు హేవ్? పిజ్జా, హాట్‌డాగ్స్, బర్గర్స్!'' అడిగాడు గవర్నరు.

సీయమ్–''అవేం వద్దు– ఇఫ్‌యుకెన్–జస్ట్ ఎ గ్లాస్ ఆఫ్ ప్యూర్ వాటర్'' అన్నాడు.

గవర్నర్ ఇబ్బందిగా పీఏ వైపు చూశాడు. పీఏ ముఖంలో రంగులు మారినా, చిరునవ్వు నవ్వుతూ "వైనాట్ సర్?'' అని బట్లర్‌కి ఏవో ఆదేశాలిచ్చాడు ఇంటర్ కామ్‌లో.

ట్రే నిండా రకరకాల ప్లాస్టిక్ పూల అలంకరణ మధ్య ఒక పొడుగాటి గాజు గ్లాసులో మంచినీళ్ళు వచ్చాయి. ఆవురావురుమంటూ ఆ నీళ్ళు తాగాడు సీయమ్.

"చెప్పండి. ఆరోగ్యం ఎలావుంది? ఆ మధ్య మీకు హార్ట్ ట్రబుల్ ఏదో వచ్చిందని విన్నాను...'' అన్నారు గవర్నర్.

''అవును. ఆపరేషన్ చెయ్యాలని మన స్టేట్ డాక్టర్స్ చెప్పారు. మన గవర్నమెంటు రూల్సు ప్రకారం ప్రభుత్వ వీఐపీలు గవర్నమెంటు హాస్పటల్లోనే సర్జరీ చేయించుకోవాలి. కానీ గాంధీనగర్ స్టేట్‌లో వుంది గవర్నమెంట్ హాస్పిటల్. అక్కడి కెళ్ళాలంటే రైవస్ కాల్వమీదుగా వంతెన దాటి వెళ్ళాలి. అనుమతి పత్రాలూ అవీ అవసరమౌతాయి. పోనీ ఇక్కడే చేయించుకుందామంటే కార్పొరేట్ హాస్పటల్స్‌లో–మీదగ్గర ప్రత్యేక అనుమతి తీసుకుని–చేరొచ్చు. కానీ ఆర్థికంగా చాలా క్షీణదశలో వున్నాం. అందుకనీ.. మీరొకసారి గాంధీ నగరం గవర్నర్‌కి ఫోన్ చేసి చెప్తే రైవస్ కాల్వ బోర్డర్‌ను దాటాలి కాబట్టి పడవద్వారానో లేక వంతెనమీదుగానో వెడతాను'' అన్నాడు సీయమ్.

''వెళ్తాను కాదు.. వెళ్ళివస్తాను అనాలి'' అని గవర్నర్ వెంటనే ఫోన్ తీసి హాట్‌లైన్ మీద గాంధీనగరం గవర్నర్‌కి ఫోన్ చేశాడు.


ఫోన్ పెట్టేసి ''అన్ని విషయాలూ వాళ్ళు చూసుకుంటారట యూడోంట్ వర్రీ..గో ఎహెడ్'' అన్నాడాయన.

సీయమ్ లేచి, థాంక్యూ... గాంధీనగర్ స్టేట్‌కీ మనస్టేట్‌కీ సత్సంబంధాలు అంతగా లేకపోవడంతో మీదగ్గరకొచ్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం జరిగింది. ఇక శెలవ్. వస్తాను '' అని తన కాన్వాయ్‌తో వెనక్కు తిరిగాడు.

చోడవరపు వారి వీధిలో గవర్నర్‌పేట సీయమ్ అధికార నివాసంలో ఫోను మోగింది. ఆయన పీయే ఫోనెత్తి వినయంగా రిసీవరు సీయమ్‌కిచ్చి చెప్పాడు మెల్లగా–

''కృష్ణలంక సీయమ్ లైన్లో వున్నారు సార్''...

''హల్లోసార్! ఎలా వున్నారు? ఆపరేషన్‌కి గాంధీనగర్ వెడుతున్నారట గదా!'' పలకరించాడు కృష్ణలంక సీయమ్.



# కొమ్మూరి సాంబశివరావు స్మారక పోటీలో బహుమతి పొందిన కథ


''అవునండీ.. అసలే బీపీ..పైగా ఈ రాజకీయాలతో అసలు విశ్రాంతి అన్నదేలేదు. ఓ నెల క్రితం నించీ ఇటు లబ్బీపేట నించీ పెనమలూరు వరకూ, రింగు రోడ్డు నించీ రామవరప్పాడు వరకూ సెపరేట్ స్టేట్ కావాలని ఒహటే రాస్తారోకోలూ నిరాహారదీక్షలూ... అధిష్టానం ఏమీ తేల్చి చెప్పదు. ఏదో మీరు, మేమూ వన్‌టౌన్‌లూ అయితే మూడు కాలవలున్నాయి గాబట్టి, కాస్తోకూస్తో వ్యవసాయం చేసుకుని, ఇంత తిండి తింటున్నాం. ఇప్పుడు మళ్ళీ ఇంకోస్టేటంటే వర్షాలమీద ఆధారపడాల్సిందే గదా! నీళ్ళడిగితే మీరొప్పుకుంటారా మేమొప్పుకుంటామా!''

''మీరేం వర్రీ అవకండి. అంతా త్వరలోనే సర్దుకుంటుంది...ప్రస్తుతం...మీరున్నకండిషన్లో అడగటం బాగోదుగానీ... మా అబ్బాయి సిద్ధార్థలో చేరతానని ఓ..గొడవపెడుతున్నాడు.. ఈ లబ్బీపేట గొడవలు తేలేలోపలే మీరోమాట చెప్తే... లేకపోతే మళ్ళీ ముల్కీ సర్టిఫికేట్లనీ, అవనీ ఇవనీ చిరాకులు''.

''దాన్దేముంది! నేను మా పీఏతో ఫోన్ చేయిస్తాలెండి...'' అని మాటిచ్చాడు. కృష్ణలంక సీయమ్ ఆనందంతో ''థాంక్యూ వెరీమచ్.. విష్ యూ ఏ హేపీ జర్నీ టు గాంధీనగర్'' అని ఫోన్ పెట్టేశాడు.

సీయం ఫోన్ పెట్టేయగానే సీయమ్ తల్లి కొడుకు దగ్గర చేరింది. '' ఒరేయ్ నాన్నా, నేను కూడా వస్తాన్రా గాంధీ నగరానికి... ఎప్పుడో చాలా కాలం క్రితం వెళ్ళాను. అప్పటికింకా ఈ దిక్కుమాలిన సొంత కుంపట్లు పెట్టుకోవటం అనేది లేదు. ఎలాగూ గాంధీ నగరం వెడుతున్నాం గదా! నువ్వుగానీ కొంచెం ఆ వన్‌టౌన్ సీయమ్‌కి గానీ ఫోన్ చేసిచెప్తే... నువ్వు రావద్దులే.. నీ ఆపరేషన్ అయాకే... నేనూ కోడలూ వన్‌టౌన్ వెళ్ళి, అక్కడ కృష్ణమ్మ ఘాట్‌లో మునిగి, ఆ దుర్గమ్మ తల్లి దర్శనం చేసుకొస్తాం. ఏదో నీ హెలీకాప్టర్‌లోనే ఓమూల తుండుగుడ్డ వేసుకుని కూచుంటాం..'' అంది .

సీయమ్ ఇబ్బందిగా...'' వన్‌టౌన్ సీయమ్ నాఫ్రెండే కానీ గాంధీ నగరం సీయమ్‌తోనే యిబ్బంది. వాళ్ళకూ మనకూ పడదు. క్రితం ఎలక్షన్లలో వాళ్ళు గోరుగుర్తు అడిగినప్పుడే నాకు అనుమానం వచ్చింది. ఇప్పుడు చూడు.. రాబోయే ఎలక్షన్లలో గొడ్డలి గుర్తుకోసం దరఖాస్తు చేసుకున్నారట. ఇక హెలీకాప్టరంటావా.. ఏ రాష్ట్రానికీ ఆర్థిక పరిస్థితి బాగోలేదు. ఉన్న హెలీకాప్టర్లనే అందరూ అమ్మేసుకుంటున్నారు. కనీసం హెలీ కాప్టరు లాండవడానికీ, పైకెగరడానికీ కొంతస్థలమయినా కావాలి గదా.. ఆ మాత్రం స్థలం వుంటే రౌడీలూ గూండాలకంటే ప్రభుత్వమే కబ్జాచేయటానికి రెడీగా వుంది. కాబట్టి హెలీకాప్టర్‌లో దుర్గమ్మ గుడిని దర్శించే ఆలోచన మానుకో. అదీగాక, మనం ఏ బెంగుళూరు నుంచైనా



దాన్ని అద్దెకు తీసుకున్నా, వేళ్ళాడే నిచ్చెన మీద నుంచీ వరదబాధితుల్లాగా మనల్ని ఎక్కించుకున్నా, గాంధీ నగరం మీదనుంచీ ఎగిరి వెళ్ళడానికి ఆ గవర్నమెంటు అనుమతి ఉండాలి...''

అత్తగారు చిన్నబుచ్చుకున్న సంగతి గమనించి, సీయమ్ భార్య ఆవిడని ప్రక్కకు తీసుకెళ్ళి, ''మీరు నిశ్చింతగా ఉండండత్తయ్యా! ఆయన అలాగే అంటార్లే. నేనేర్పాటు చేస్తాగా!''అంది. అత్తగారు ''మా తల్లే'' అంటూ లోపలికి వెళ్ళింది.

భర్తదగ్గరకొచ్చి'' ఎలాగూ మనకి పాస్‌పోర్టులూ వీసాలూ తప్పవుగదా! గాంధీనగర్ వెళ్ళాక అక్కడి గవర్నర్‌కి ఫోన్ చేసి వన్‌టౌన్ స్టేట్‌కి ఒక్కరోజుకి టూరిస్టు వీసా తీసుకోండి మాయిద్దరికీ. పొద్దునెళ్ళి సాయంత్రం వచ్చేస్తాం'' అంది. భార్యమాట కాదనలేక సరేనన్నాడు సీయమ్.

బీసెంటు రోడ్డుకి అటూ యిటూ ''సీయమ్ అంకుల్! మీరు పూర్తి ఆరోగ్యంతో తిరిగిరావాలి'' ''క్షేమంగా వెళ్ళి లాభంగా రండి'' లాంటి ప్లకార్డులు పట్టుకుని స్కూలు పిల్లలూ, పౌరులూ వీడ్కోలు పలికారు. వంతెనకి కాస్త ఇవతలగా బందరు మిఠాయిదుకాణం వద్ద ఆగి, రెండు స్వీట్ ప్లాకెట్లు తీసుకున్నాడు సీయమ్. ఒకటి గాంధీనగరం గవర్నర్‌కీ, ఇంకోటి - వస్తేగిస్తే - సీయమ్‌కీ.

వంతెన దగ్గర ఫుల్‌సెక్యూరిటీ వుంది. వంతెనకి ఇటేపు గవర్నర్‌పేట రాష్ట్రజెండా, అటేపు గాంధీనగర్ రాష్ట్రజెండా రెపరెపలాడుతూ ఎగురుతున్నై.

సీయమ్ కారుదిగుతూ పీయేని అడిగాడు. ''ఓడలోనా లేక వంతెనమీదనుంచీ-బైరోడ్డా?''

''ఓడా! సారీ సర్. కాలవలో నీళ్ళు చాలా తక్కువగా వున్నై. కనీసం బల్లకట్టుకూడా నడవదు. మీరంతగా పట్టుపడితే పంచెలు పైకెగదోసి, మోకాలి లోతు నీళ్ళలో వెళ్ళగలం. అయినా, మీ పర్సనల్ సెక్యూరిటీ అనుమతి కావాలి'' అంటున్న పీయేతో- ''వద్దొద్దులే...మామూలుగా వంతెన మీదనించే వెడదాం'' అని సీయం, ఆయన భార్య, తల్లీ, పీయే డ్రైవరూ వంతెన దగ్గర సాయుధ జవానులకు పత్రాలన్నీ చూపించారు. ఆ పత్రాలన్నీ పరిశీలించి, తిరిగి ఇచ్చేస్తూ''సారీ సర్! డ్యూటీ ఈజ్ డ్యూటీ'' అని మర్యాదగా నవ్వాడు ఆ అధికారి.

''రండిసార్! కారెక్కండి'' అన్న పీయేతో-

''చాల్లేవయ్యా.. జానాబెత్తెడు లేదువంతెన. కాస్త నడవలేవూ?కొవ్వైనా కరుగుతుంది'' అని సీయమ్ తల్లి ముందుకు నడిచింది. సీయమ్ కూడా ఇక తప్పదన్నట్లు చిరునవ్వు నవ్వుతూ తల్లిని ఫాలో అయ్యాడు. వెనకే భార్య. కారుడ్రైవరు నెమ్మదిగా డ్రైవ్ చేసుకుంటూ వెనకనే ఫాలో అయాడు. పీయే బిక్కమొహం వేసుకుని, కారు ప్రక్కనే నడిచాడు.

ఇక్కడ సీయం ఫ్యామిలీ వంతెన దాటుతున్న సమయాన ఏలూరురోడ్డు రామమందిరం దగ్గర ప్రతిపక్షాల ప్రదర్శన జరుగుతోంది. ప్రతిపక్షం నాయకుడు పెద్దగా అరుస్తున్నాడు.

''సీయం! కమ్‌బ్యాక్! ఆపరేషన్‌కి పక్కరాష్ట్రాని కెళ్ళడం మన రాష్ట్ర వైద్యులను అవమానించడమే. విరాష్ట్రీ మారక ద్రవ్యాన్ని వృథా చేసే హక్కు మీకెవరిచ్చారు? మన గవర్నరు పేట రాష్ట్రంలో ప్రైవేటు వైద్యం చేయించుకోవడానికి మీదగ్గర డబ్బే లేదా? వరల్డ్‌బ్యాంకునుంచీ వచ్చే నిధులన్నీ ఏమయ్యాయి! ఉన్నత ప్రభుత్వాధికారులు గవర్నమెంటు హాస్పిటల్లోనే వైద్యం చేయించుకోవాలనే రూలును రద్దు చేయాలి. లేదా మన గవర్నరుపేట లోనే గవర్నమెంటు ఆస్పత్రి కట్టించాలి'' ఇలా అరుస్తూ నానా యాగీ చేస్తున్న ఆయన్ని, ఆయన అనుచరులతోపాటు రోడ్డు మీదనించీ ఈడ్చుకెళ్ళి వ్యాన్‌లోపడేసి తీసుకెళ్ళారు పోలీసులు. అలా ఏదో ఒక కారణంమీద పోలీసులతో లాక్కెళ్ళబడి, నానా హైరానాపడి, చొక్కాబొత్తాలు వూడి పోతూ, చెమటలు కారుకుంటూ బలవంతాన వ్యాన్‌లో కెక్కించబడి, అరెస్టయి మళ్ళీ బెయిలుమీద యింటికెడితేగానీ తోచదు ఆయనకి.

నెలకో అరడజను సార్లైనా అలా చేయమని ఆయన పర్సనల్ డాక్టర్ సలహా ఇచ్చాడట. అది కూడా సిద్ధయోగ, ధ్యానయోగాలాగా ఒక యోగాట. దాన్ని ధర్నాయోగ, లేక యాగీ యోగ అని అంటారట. దాంతో ఆయనకున్న షుగరు, కీళ్ళ వాతాలూ అన్నీ పోయి చక్కగా రక్త ప్రసరణ అయి, పది కాలాలపాటు అరెస్టవుతూ బతకొచ్చట.


సరే...సీయమ్‌గారూ, ఆయన ఫ్యామిలీ వంతెన దాటగానే గాంధీనగర్ గవర్నరు ఆయన్ని ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నారు. అప్పుడే హడావుడిగా వచ్చి కార్లోంచి దిగిన ఆ రాష్ట్ర సీయమ్ దగ్గరకొచ్చి ఈయన్ని కౌగిలించుకున్నాడు. ఏదో ఓపెనింగుకి వెళ్ళాల్సొచ్చిందని, రావటం లేటయిందనీ తెగ ఫీలయిపోయాడు. గవర్నరు పేట సీయం చాలా ఆశ్చర్యపోయి ఆనందపడ్డాడు. తనుతెచ్చిన స్వీటు ప్యాకెట్లను ఇద్దరికీ యిచ్చాడు. అంతా కలిసి సత్యన్నారయణపురంలోని శివాలయం వీధిలో వీఐపీ గెస్టు హౌస్‌కెళ్ళారు.

మర్నాడు గవర్నరుపేట సీయమ్ గవర్నమెంటు హాస్పిటల్లో చేరాడు. ఆ మర్నాడే ఆపరేషను.

ఫోన్ తీసి ఒన్‌టౌన్ సీయమ్‌కి డయల్ చేశాడు. ఈయన వచ్చిన విషయం తెలిసి ఒన్‌టౌన్ సీయం చాలా ఆనందపడ్డాడు. ఇలా తన తల్లికీ, భార్యకీ ఓ నాలుగురోజుల తర్వాత ఒక్క రోజుకి టూరిస్టువీసా అడిగితే ఆయన ''ఇదో పెద్ద పనా! ఇమ్మిగ్రేషన్ అధికారులతో చెప్పి, అవసరమైన ఏర్పాట్లన్నీ చేయిస్తా'' అని వాగ్దానం చేశాడు. ఆరు నెల్ల క్రితం తనకు మాచారం ఆంజనేయస్వామికి మొక్కుందంటే, ఎంతో పర్సనల్ కేర్ తీసుకుని, మూడురోజులు అతిథి మర్యాదలు చేసిన విషయం తానింకా మర్చిపోలేదని అన్నాడు.

గవర్నరుపేట సీయమ్ కొంచెం సందేహిస్తూనే- ఇలా కాలువలో నీళ్ళు మరీ తక్కువున్నాయని చెప్పి, కొంచెం బ్యారేజి గేట్లు తెరిస్తే మీ మేలు మర్చిపోలేమని, అన్నాడు.

''అయ్యో! అసలు నదిలో నీళ్ళుంటే గదండీ! ఈ ఆల్‌మట్టి వ్యవహారం ఎప్పటికి తేలేను? మా



**రచయిత పరిచయం**

**ఈ** మధ్య చాలా కరెంట్ ఇష్యూలు షాక్ కొడుతున్నై. న్యూస్ పేపర్ చదివీ, న్యూస్ టీవీలు చూసీ, పెద్ద మెదడు ఎప్పుడో చెడిపోయింది. ఉన్నచిన్న మెదడును జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాను. మనుషులు కుంచించుకుపోతున్నారు. అందాల రాముడులో పాట- పులిని చూసీ పులీ ఎన్నడూ బెదరదూ... మాయరోగమదేమొగానీ మనిషి మనిషికి కుదరదు... ఎప్పుడూ జ్ఞాపకమొస్తుంటుంది. హైదరాబాద్ నగర ట్రాఫిక్‌లో పొరపాటున ఒక వాహనం ఇంకోదానికి తగిలి చిన్న గీతపడితే వందమర్డర్లు చేసిన వాణ్ణి చూసినట్టు చూసి అరుస్తారు. ఈ చిన్న జీవితాల్లో కొంచెం సహనం ప్రాక్టీస్ చేస్తే ఎంతబాగుండు! ముందు ముందు ప్రతి ఇంట్లోనూ మనిషికొక కిచెన్ కట్టేసుకునేట్టున్నారు. ఇదేనా బయోడేటా.. (నాకథకు బహుమతి నిచ్చినందుకు నవ్యకు కృతజ్ఞతలు)

**ప్రసన్నకుమార్ సర్రాజు.**

ఏలూరు కాలువ కూడా ఎండుకుపోతోంది. ఇంకో పదిహేను రోజులకి వున్న నీళ్ళు కూడా యింకిపో యేట్టున్నాయి. అప్పుడు ఆ ఆల్‌మట్టి కంటే మనకా లవల్లో ఆల్‌బురదే బెటరవుతుందేమో! కనీసం అది ఒంటికి రాసుకుని, కేరళ వైద్యం అయినా చేయించు కోవచ్చు'' అని జోక్ చేశాడు. ఈయనకీ నవ్వొచ్చింది.

ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా అయింది. ఆయన తల్లీ, భార్య, కృష్ణమ్మఘాట్ దగ్గర చెంబెడు నీళ్ళు పదిరూపాయలచొప్పున కొనుక్కుని, స్నానం అయిందనిపి--చి దుర్గమ్మ ఆలయం వెళ్ళి, అమ్మవారిని దర్శించుకుని పూజారిని తీర్థ ప్రసాదాలు అడిగితే ''తీర్థం ఇవ్వటల్లేదమ్మా! ప్రసాదాలు ఆఫీసులో కొనుక్కోండి'' అని నెత్తిన శఠగోపం పెట్టి పంపించాడు. మల్లేశ్వరస్వామి ఆలయంలో విభూది తీసుకుని, తిరిగొచ్చేటప్పుడు సబ్‌వే దాటాక వంతెన దగ్గర సెక్యూరిటీ విభూదిని సీజ్ చేసి, ల్యాబ్‌కి పంపి, అందులో ఆంత్రాక్స్‌లాంటిదేమీ లేదని రిపోర్టు వచ్చేదాకా ఓ గంట వీళ్ళని ఆపి, గాంధీనగర్‌లోకి వెళ్ళనిచ్చారు.

పదిహేను రోజుల తర్వాత సీయమ్ తిరిగొచ్చే టైమ్‌కి మళ్ళీ ధర్నా ప్లాన్ చేశాడు ప్రతిపక్షనాయకుడు.

ఎల్లుండి ధర్నా వుందనగా వాళ్ళమ్మాయి 'సిని

**''అయ్యో! అసలు నదిలో నీళ్ళుంటే గదండీ! ఈ ఆల్‌మట్టి వ్యవహారం ఎప్పటికి తేలేను? మా ఏలూరు కాలువ కూడా ఎండుకుపోతోంది. ఇంకో పదిహేను రోజులకి వున్న నీళ్ళు కూడా యింకిపోయేట్టున్నాయి. అప్పుడు ఆ ఆల్‌మట్టి కంటే మనకాలవల్లో ఆల్‌బురదే బెటరవుతుందేమో! కనీసం అది ఒంటికి రాసుకుని, కేరళ వైద్యం అయినా చేయించుకోవచ్చు''**


మాకి తీసుకెళ్ళు నాన్నా అని గారాబంగా అడిగింది. ఆరోజు అమ్మాయి పుట్టినరోజు కాబట్టి సరే అన్నాడు. సాయంత్రం ఆరయింది. ఇంట్లో అంతా తయారయ్యారు. ఈయన మాత్రం కుర్చీలో కూర్చున్నవాడు అలాగే కూర్చున్నాడు. ఎన్ని సార్లు భార్య, కూతురు 'రెడీ అవండి' అని తొందర పెట్టినా 'ఇదుగో అదుగో నేనెంతసేపు రెడీ అవడానికి' అంటున్నాడు తప్పితే లేవడంలా. వాళ్ళ మారుతీ వ్యాన్ డ్రైవర్ కూడా ''అమ్మగారూ! 6-45కి సినిమా. ఇప్పుడు బయలు దేరితేగానీ ట్రాఫిక్‌లో టైముకి చేరుకోలేం'' అని చెప్తూనే వున్నాడు.

ఆ సమయానికి ట్యూషన్ కెళ్ళిన పెద్దకొడుకు వచ్చాడు. సంగతి తెలుసుకుని ''మీరేం వర్రీ అవకండి. నాన్నగారికి మీతో సినిమాకి పంపే బాధ్యత నాది. మీరెళ్ళి వ్యానులో కూర్చోండి'' అని ప్రక్కగదిలో కెళ్ళి, రెండు వీధులవతలే వున్న పోలీసు స్టేషన్‌కి ఫోన్ చేసి, ఏదో చెప్పాడు.

కరక్టుగా ఐదు నిముషాల్లో అరడజను మంది పోలీసులొచ్చి ఈయన్ని బరబరా యీడ్చుకెళ్ళి, ఈయన ''సీయమ్ డౌన్ డౌన్'' అని అరుస్తూంటే ఎత్తి వ్యాన్‌లో కుదేశారు. అదే అదునుగా వ్యాన్ డ్రైవర్ వెంటనే ముందుకురికించాడు. తల్లి కొడుకు తెలివి తేటలకి అబ్బురపడింది. చెల్లి అన్నయ్యకి టాటా చెప్పింది.

సీయమ్ ఒచ్చే రోజు ప్రతిపక్షనాయకుడు కార్యకర్తలందరికీ కబురంపి, కాస్త పెందలాడే రైవస్ కాల్వ దగ్గర రెడీగా వున్నాడు.

సీయం వచ్చే టైముకి ఓ ముప్ఫైమంది కార్యకర్తలు కూడా పోగవలా. ఏమిటి విషయమంటే, వాళ్ళ కుటుంబాలన్నీ వేరే వేరేగా విడిపోతున్నాయట. కలిసి కట్టుగా ఎవరూ ఉండటం లేదుట. ఓ

కార్యకర్తయితే వాపోయాడు. వాళ్ళింట్లో వున్న నాలుగు గదులూ నాలుగు వంటగదులయిపోయాయట. తనకో గ్యాసు పొయ్యి, తన భార్యకో గ్యాసు పొయ్యి, కొడుక్కీ కోడలికీ చెరో పొయ్యి ఏర్పాటయిందట. ఉప్పూ పప్పూ ఎవరికీ చాలక ఒకళ్ళ నుంచీ ఒకళ్ళు అడుక్కుంటూ జీవిస్తున్నారట. ఇదివరకు ఒక్క వంటగదిలో అందరికీ వండితే, అక్కడే సమిష్టిగా భోజనాలు అయిపోయేవిట. ఇప్పుడిదేం 'పొయ్యే' కాలం అని ఆ కార్యకర్త బాధపడ్డాడు.

ఇదంతా విన్న మిగతా కార్యకర్తలు ''మీరు నయం. కనీసం రూమ్‌కు వంటగదివుంది. ఉన్న ఒక్క వంటగదీ మా ఆవిడ ఆక్రమించుకుని తనకి మాత్రం టిఫిన్ చేసుకుతినేసింది. మాకు పొద్దుట్నించీ టిఫిన్లులేవు. సీయమ్‌గారు తొందరగా వస్తే నాలుగు నినాదాలిచ్చి, అరుపులు అరిచీ తొందరగా అరెస్టయి జైలుకెడితే అక్కడ కడుపునిండా టిఫినైనా పెడతారు గదా అని ఆశతో వచ్చాం'' అన్నారు. సర్జరీతో గుండెదిటవు అయిన సీయమ్, సీయమ్‌గారి ఫ్యామిలీ కాన్వాయ్ వచ్చింది-పన్నెండున్నరకి. ప్రతిపక్షాలకి అరవడానికి కూడా ఓపిక లేకపోయింది. అంతా నీరసంగా వున్నారు. వీళ్లెలాగూ అరవటల్లేదు గదా అని పోలీసులూ మిన్నకుండిపోయారు.

ఒంతెనదాటి గవర్నరుపేట రాగానే సీయమ్‌భార్య-నేను మా అమ్మవాళ్ళింటికి పోతున్నా-అని ఓ ఆటో ఆపి ఎక్కింది.

''ఒరే అబ్బీ! నీకు ఆపరేషన్ బాగా జరిగిందిగదా! మందులు వేళకు వేసుకో. నేను నాకూతురింటికెళ్ళి కొన్నాళ్ళుంటా'' అని సీయమ్ తల్లి వేరే ఆటో ఎక్కింది.

సీయం జేబులో సెల్‌ఫోన్ మోగింది. ఆయన కూతురు ''డాడీ! నేనూ మీ అల్లుడుగారూ విడిపోయాం. వేరే ఫ్లాట్స్‌లో వుంటున్నాం'' అని చెప్పింది.

సీయం ఒక నిట్టూర్పు వదిలి, కారులోకూర్చున్నాడు. డ్రైవర్ ఎంతసేపటికీ రాడేం! ఎక్కడకెళ్ళాడు!

''డ్రైవర్ ఇంక రాడటసార్! వేరే చోట సెటిలవడానికి వెడుతున్నానని చెప్పాడు'' అని పీయే సీయమ్‌కి సెల్యూట్ చేసి ''సార్ నాక్కూడా ఎందుకో మిమ్మల్ని విడిచి వేరే వెళ్ళి పోవాలనిపిస్తోంది సార్!గుడ్‌బై'' అని వెళ్ళిపోయాడు. సీయమ్‌కి అదోలాటి వైరాగ్యం కలిగింది. కారు తనే డ్రైవ్ చేసుకుంటూ తన అధికార నివాసానికి వెళ్ళాడు. సీయం ఇంట్లోకి ప్రవేశించగానే అప్పటి దాకా టీవీ చూస్తున్న వంటవాడు, పనిమనిషి చటుక్కున టీవీ ఆఫ్‌చేసి భయం భయంగా నుంచున్నారు. వాళ్ళని ఫర్వాలేదన్నట్లు సైగచేసి సోఫాలో కూలబడి ''ఏంటర్రా అంత ఇంట్రెస్టుగా చూస్తున్నారు!'' అన్నాడు సీయమ్. ''క్రికెట్ టెస్టుసార్'' ధైర్యం చేసి వంటవాడు చెప్పాడు. సీయమ్‌ని ఓ వారం రోజులు విశ్రాంతి తీసుకోమని అక్కడి డాక్టర్లు చెప్పారు. ''సరే లే.. టీవీ ఆన్‌చెయ్యి నేనూ చూస్తాను'' అన్నాడు సీయమ్.

అయ్యగారు అలా అనగానే వుత్సాహంగా క్రికెట్ ఛానెల్ పెట్టాడు వంటవాడు.

NZ VS BAN అని కనిపించింది.

''ఓహో..న్యూజిలాండ్ వర్సస్ బంగ్లాదేషా'' అనిరిలాక్స్ అయి సోఫాలో వెనక్కివాలాడుసీయమ్.

''కాదు సార్! నూజివీడు వర్సస్ బనగానపల్లి'' అని చెప్పాడు వంటవాడు వినయంగా.

★



## ఈషా నిరాశ

ఈషా కొప్పికర్‌కు 'ఖల్లాస్'.పిల్లగా పేరైతే వచ్చింది గానీ, బ్రేక్ రాలేదు. ఇంతేకామ్ సినిమాపై ఈషా చాలా ఆశలు పెట్టుకుంది, కాని, ప్రేక్షకులు దాన్ని తిప్పికొట్టారు. అయితే ఆ సినిమా కేవలం మార్కెటింగ్, యాడ్స్ లోపం వల్లే ఫెయిలయిందని ఈషా అంటోంది. నిజానికి అది చాలా మంచి సినిమా అని, తన నటన అదిరిందని ఊదరగొడుతోంది. చివరికి ఈషాకి ఐటం సాంగ్స్ మాత్రమే మిగిలేలా వున్నాయి. అయితే అందులో నటించడానికి ఏం ఉండదు మరి! అందాల్ని చూపించడం తప్ప.